క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు క్రమం తప్పుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. నరాల, గుండె జబ్బులు, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేపటితో ముగియనున్న శుభకార్యాలు

సింహాద్రిపురం : రెండు రోజుల్లో శుభ కార్య తేదీలు ముగియనున్నట్లు భానుకోట ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్‌శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 తేదీ నుండి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు శుక్ర మౌఢ్యమి (మూఢం) ఉందని, శుభకార్యాలకు ఈనెల 16, 17వ తేదీలు మాత్రమే అనుకూలమన్నారు. ఈనెల 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి, 29వ తేదీన అమావాస్య, 30వ తేదీ నుండి ఏప్రిల్ 8వ తేదీవరకు ఉగాది నుండి శ్రీరామనవమి వరకు నూతన సంవత్సరం మొదలవుతుందన్నారు. శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కల్యాణం అయ్యేవరకు పెద్దలు ఎటువంటి శుభ కార్యాలు నిర్వహించరన్నారు.ఈనెల 18 నుండి ఏప్రిల్ 8 వరకు ఎటువంటి శుభ ముహూర్తాలు ఉండవని భక్తులకు తెలిపారు. ఏవైనా శుభ కార్యాలు ఉంటే ఈనెల 16, 17వ తేదీల్లోపు ముగించుకోవాలన్నారు. ఉగాది కోటిరికానికి వెళ్లే నూతన వధువులు ఈనెల 17వ తేదీలోపు వారి పుట్టింటికి వెళ్ళేలాగా చూసుకోవాలన్నారు.

శేషయ్యకు ఘన సత్కారం



ఎంవీ శేషయ్యను సత్కరిస్తున్న శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల నుంచి కాశీకి సుమారు 1635 కిలోమీటర్లు మహాపాదయాత్రగా నడిచి వెళ్లి కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శనం చేసుకుని స్వగ్రామానికి చేరుకున్న తొండూరు మండలం ముదూరుకు చెందిన వెంకటశేషయ్యను సత్కరించారు. శుక్రవారం పట్టణంలోని గీతా మందిరంలో శ్రీరంగనాథ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, సీఈఓ అల్లం రంగనాయకులు, ఎస్టీయూ సంఘ రాష్ట్ర ఉపాధ్యాయ నేత అంగడి నాగేంద్ర, శ్రీవీరనారాయణస్వామి అంధుల ఆశ్రమ చైర్మన్ రామ్మోహన్, మున్సిపల్ ఆఫీస్ సీనియర్ అకౌంటెంట్ రాఘవేంద్రారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీ మహాపాదయాత్ర పూర్తి చేసుకుని శేషయ్యను స్ఫూర్తిగా తీసుకుని హిందు ధర్మాన్ని ప్రోత్సహించాలన్నారు. అలాగే భగవద్గీత భక్త సమాజ మండలి సభ్యులు కూడా ఆయనను సత్కరించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ శేషయ్య ఇంటికి వెళ్లి దంపతులిద్దరిని శాలువాలు. పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి రాచనేని ఆంజనేయులు, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్సార్ క్రీడామైదానంలో కడప జిల్లా హాకీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 34వ సబ్ జూనియర్ బాయ్స్, బాలికల కబడ్డీ పోటీలకు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : చిలంకూరుకు చెందిన 7వ తరగతి చదువుతున్న బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా లెటర్ రాసి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుశివశంకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : మండలంలోని టీ సుంకేసుల గ్రామానికి చెందిన గోడెద్దుల అఖిల్ (17) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని ఎఎస్‌ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు. అఖిల్ అవ్వను స్కూటర్‌లో ఎక్కించుకుని ఎర్రగుంట్లలో దించి, తిరిగి స్వగ్రామమైన టీ సుంకేసులకు బయలుదేరారు. కడప రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు బలమైన గాయం అయింది. స్థానికులు 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎర్రగుంట్ల : వారంతా రెక్కాడితేకానీపూట గడవని కూలీలు. కరువుతో చేసేందుకు పనులు లేక ఉపాధి పథకం కిందనైనా పనులు చేసి పొట్టపోసుకుందామని వస్తే తీరా పనులు చేసిన తర్వాత వేతనాలు సకాలంలో మంజూరు కాని పరిస్థితి. చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ రెండు నెలలకు పైగా పెండింగ్‌లో ఉండిపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి కూలి డబ్బులు మంజూరుకాకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పనులకు సంబంధించిన బిల్లులన్నీ ఉపాధి సిబ్బంది ప్రభుత్వానికి పంపినప్పటికీ, ప్రభుత్వం మాత్రం కూలీలకు సంబంధించిన వేతనాలను వారి ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఉపాధి కూలీలు వేతనాలు కోసం పడిగాపులు కాస్తున్నారు. కొందరు కూలీలు డబ్బులు రాకపోవడంతో ఇతర పనులల్లోకి వెళ్లి జీవనం గడుపుతుండుగా, మరికొందరు రేపు మాపు అంటూ అధికారులు చెబుతున్న మాటలు వింటూ అలాగే పనుల్లోకి వస్తున్నారు.

ఉపాధి పథకంకు సంబంధించి ఎర్రగుంట్ల మండల వివరాలు		
జాబ్ కార్డులు	:	5500
యాక్టివ్ కార్డులు	:	4293
గ్రూపులు	:	197
గ్రామ పంచాయతీలు	:	17

వేతనాలందక ఇబ్బందులు

ఎర్రగుంట్ల మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలలోని గ్రామాల్లో 197 గ్రూపుల కింద 5500 జాబ్ కార్డులుండగా 4293 మంది కూలీలు ఉపాధి పథకం కింద యాక్టివ్‌గా ఉన్నారు. ప్రస్తుతం డీఓపీ, పూడిక తీత, ఇతర పనులు జరుగుతున్నాయి. కూలీలకు ఒక్కొక్కరికి రెండు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలన్నింటినీ త్వరగా తమ ఖాతాలకు జమయ్యే విధంగా చూడాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి బిల్లులు పంపించాం



రెండు నెలలుగా ఉపాధి కూలీలకు సంబంధించిన వేతనాలు మంజూరు కాలేదు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ ప్రభుత్వానికి పంపడం జరిగింది. కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో బిల్లులన్నీ మంజూరవుతాయి. – గంగాభవాని, ఏపీఓ, ఎర్రగుంట్ల

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మోపూరి గోపాల్, సావిత్రిల కుమార్తె సుఖిత, అల్లుడు సందీప్‌ల వివాహం రాజంపేటలోని వజ్రం ఫంక్షన్ హాలులో జరిగింది. శుక్రవారం పులివెందులలోని విజయ గార్డెన్‌లో రిసెప్షన్ జరగడంతో ఈ వివాహ వేడుకలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు డిష్ వెంకటరెడ్డి, విజయకుమార్ నాయుడు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్ బాషా, నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ముస్లింలు అత్యంత పవిత్రంగా కొలిచే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే వారికి ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు పుణ్యకార్యం అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజద్‌బాషా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం పెద్ద దర్గాలో వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. దర్గా మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి వారికి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇఫ్తార్ విందు పుణ్యకార్యంగా భావిస్తున్నామన్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు



లింగాలలో రంగులు చల్లుకుంటున్న పిల్లలు



జమ్మలమడుగులో హోలి రంగులు చల్లుకున్న స్థానికులు

లింగాల : మండలంలో పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా హోలీ సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

జమ్మలమడుగు : పట్టణంలో హోలి పండుగ సందర్భంగా క్షత్రియ కులదైవమైన అంబాభవాని ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. యువకులు ఇంటింటికి వెళ్లి రంగులు చల్లుకున్నారు.

విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం

పులివెందుల టౌన్ : రెడ్డి కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో త్వరలో ఏర్పాటు చేసే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు విరాళాలు సేకరిస్తున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి తన వంతు సాయంగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ఆయనకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ నాయకులు సర్వోత్తమరెడ్డి, రఘురామిరెడ్డి, చప్పిడి జగదీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతకొమ్మదిన్నె : నాగిరెడ్డిపల్లెలో పశువులకు గాలుకుంటువ్యాధి మరియు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీధరరెడ్డి, స్థానిక పశు వైద్యుడు నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఏడీ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి లక్షణాలు తీవ్రమైన జ్వరం, నీరసం నోటి నుండి తీగల మాదిరి చొంగ కార్చడం, నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు తీసుకపోవడం జరుగుతుందని, ఈ వ్యాధి వలన పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం ద్వారా రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. అలాగే బ్రూసెలోసిస్ వ్యాధి లక్షణాలు అయిన జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, గర్భ స్రావమట్టు, మాయ వేయకపోవడం, చూడి నిలవకపోవడం, మగ పశువులలో వృషణాల వాపులు, కీళ్లవాపులు, వంధత్వం సంభవిస్తుందని, ఈ వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఇతర జంతువులకు వ్యాపిస్తుంది అని వ్యాధి సోకిన పశువుల నుండి మనుషులకు కూడా సోకుతుందన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణకు ముందుగానే పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు.

అనాథ వృద్ధులకు అల్పాహారం

వేంపల్లె : స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా అనాథ చారిటబుల్ ట్రస్ట్‌లో అనాథ వృద్ధులకు అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం బలిజ సంఘం ప్రెసిడెంట్ నంబూరు కులాయప్ప కుమారుడు సాయికుమార్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి



మల్చింగ్ విధానం ద్వారా సాగు చేసిన పంట

పులివెందుల రూరల్ : వ్యవసాయంలో మల్చింగ్ విధానంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. బిందు, తుంపెర సేద్యాల తరహాలో ఈ మల్చింగ్ విధానంపై ఇప్పుడిప్పుడే రైతులు పంటలు సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ విధానం కూడా ఎంతో ఊరటనిస్తుందని రైతులు అంటున్నారు. ఈ సరికొత్త ప్రయోగం ద్వారా ఆశించిన ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నట్లు రైతన్నలు తెలిపారు. మొక్క చుట్టూ వ్యాపించి వేరు వ్యవస్థను ఏదైనా పదార్థంతో కప్పడాన్ని మల్చింగ్ అంటారు. కృత్రిమంగా తయారు చేస్తే ప్లాస్టిక్ పేపర్‌తో మల్చింగ్ చేసే అవకాశం ఉంది. ఈ పద్ధతులను తేమను సంరక్షించడంతోపాటు కలుపు నివారణ, నేల కోతకు గురికాకుండా కాపాడుకోవచ్చునని రైతులు వాపోతున్నారు. రసాయన ఎరువులు, సంరక్షణ అయ్యే ఖర్చులో 25శాతం ఆదా చేసుకునే అవకాశం ఉందని రైతులు తెలిపారు. మల్చింగ్ అనే వ్యవసాయ, ఉద్యానవన అనువర్తనాలకు అనేక ప్రయోజనాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా అందించబడుతుందని అధికారులు అంటున్నారు. మల్చింగ్ విధానానికి ఎక్కువగా ప్లాస్టిక్ పట్టలను ఉపయోగిస్తారు. 400 మీటర్ల ఒక పట్ట ఖరీదు రూ.1000ల నుంచి నాణ్యత ఆధారంగా రూ.1500లు పలుకుతున్నాయి. ఎకరాకు సాగు విస్తీర్ణం ఆధారంగా ఐదారు ప్లాస్టిక్ పట్టలను ఉపయోగిస్తారు. ఇలాంటి వ్యవసాయ విధానంలో మల్చింగ్ పద్ధతిని పరిచే రైతులకు ప్రభుత్వం కాస్త వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ జయంతి పూజలు



అమ్మవారికి తామరమాల, పట్టుచీరను అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు

వేంపల్లె : శ్రీలక్ష్మీ జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీలక్ష్మీదేవికి లక్ష్మీ జయంతి పూజ కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యుల నేతృత్వంలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, శ్రీసూక్త పారాయణ, అష్టదల పాద పద్మారాధనార్చన, నివేదాన అనంతరం తామర మాలలతో అలంకరించి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేద మంత్రోచ్చరణతో శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వేంపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుగోపాల్‌లు ఆలయంలోని లక్ష్మీదేవి అమ్మవారికి కర్ణాటక నుంచి తెప్పించిన రూ.16వేలు విలువ చేసే తామరమాల, రూ.11వేలు విలువ చేసే పట్టుచీరతో అలంకరించారని తెలిపారు. ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.

సంక్షేమ పథకాల అమలులో జగనన్నే టాప్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల అమలులో జగనన్నే టాప్ అని, ప్రపంచంలోనే జగనన్న పేరు లిఖించబడిందని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా కనిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న ప్రవేశ పెట్టినన్ని సంక్షేమ పథకాలు, ఏ రాష్ట్రం గాని, ఏ దేశం గాని అమలు చేయలేదన్నారు. దీంతో జగనన్న పేరు ప్రపంచ చరిత్రలో లిఖించబడిందన్నారు. జగనన్న ప్రతి కుటుంబాన్ని సంతోష పరిచాడని, కేవలం కార్యకర్తల మనోభీష్టం, మనోభావాల మేరకు నడుచుకోలేదని, దీని కారణంగానే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందన్నారు. అయితే 2029లో వచ్చే జగన్ 2.0లో కార్యకర్తలకు మంచి జరుగుతుందని జగనన్న మాట ఇచ్చారని, జగనన్న మాట ఇస్తే మడమ తిప్పే ప్రసక్తే లేదన్నారు. అయితే జగనన్న గాని, ఏ ఎమ్మెల్యే అభ్యర్థిగాని ఓడి పోలేదని, ప్రజలే చంద్రబాబు చెప్పిన మోసపూరిత వాగ్దానాలకు మోసపోయి ఓడిపోయారన్నారు. ప్రస్తుత కూటమి నేతలు, ప్రభుత్వ పెద్దలు ఎక్కడ చూసిన దోపీడీలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు రాజ్యమేలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి, ఇసుక, మద్యం, భూ కబ్జాలు, లేఔట్లు ఏదీ వదలడం లేదని ధ్వజమెత్తారు. 9 నెలల్లోనే ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత వచ్చిందని, వైఎస్సార్ సీపీ చేపట్టిన చిన్న చిన్న ఆందోళనల్లో వచ్చిన ప్రజలే ఇందుకు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని త్వరలో తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి పాలన సాగించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు, ఎయిర్ పోర్టులు నిర్మించి అనేక మందికి ఉపాధి కల్పించారని, అది సంపద సృష్టి అన్నారు. రైతులకు ప్రతి దశలో సాయం చేయడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించి రైతులకు ఆదాయం చేకూర్చిన ఘనత జగనన్నదేనని, ఇది సంపద సృష్టి అన్నారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి, ఇపుడేమో చెవిలో చెప్పాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

నా తనయుడికి మద్దతివ్వండి:

2014, 2019 ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరూ కృతజ్ఞుడనని, 2029 ఎన్నికల్లో తన వారసుడు నరేన్ రామాంజుల రెడ్డికి మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తెలిపారు. నరేన్‌ను నియోజకవర్గ కార్యకర్తలకు సభా ముఖంగా పరిచయం చేసి తనకు ఇచ్చిన సహకారమే తన కుమారుడికి కూడా ఇవ్వాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

నేను చూసాను... నేను విన్నాను.. నేను ఉన్నాను...: 2019 ఎన్నికల్లో నేను చూసాను.. నేను విన్నాను... నేను ఉన్నాను.. అనే ఒకే వాక్యంతో జగనన్న ఎన్నికల ప్రచారం నిర్వహించి అధికారంలోకి వచ్చారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. జగనన్న తన పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలతో మెనిఫెస్టో తయారు చేసి దానిని 99 శాతం అమలు చేశారన్నారు. ఐదేళ్ల పాలనలో జగనన్న రూ. 2.80 లక్షల కోట్లు డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలు అందించారన్నారు. 2024లో సంపద సృష్టిస్తా అని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సంపద సృష్టించడం ఎలాగో చెవిలో చెప్పాలని వెటకారంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే కరెంట్ బిల్లులు, నిత్యావసరాల ధరలు పెంచిన కూటమి ప్రభుత్వం మరో రూ. 14వేల కోట్లు భారం వేస్తామని బడ్జెట్‌లో స్పష్టం చేశారన్నారు. రూ.3.2లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బాహుబలి బడ్జెట్ అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నేతలు సూపర్ సిక్స్‌లో కేవలం రెండు పథకాలకు మాత్రమే కేటాయింపులు చేశారని, అవి కూడా అరకొర మాత్రమేనన్నారు. మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రఘునాథరెడ్డి, వీరారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మహిళా అధ్యక్షురాలు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ, ఎంపీపీ చీర్ల సురేష్, సీకే దిన్నె శ్రీనివాసురెడ్డి, వివిధ అనుబంధాల జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, శివరామక్రిష్ణ, రాఘవరెడ్డి, సూర్య నారాయణ, రాజు బాషా తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, చెన్నకేశవరెడ్డి, శివ సుబ్రమణ్యం, మూలె సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో గోపూజతో గిరి ప్రదక్షిణ



పుష్పగిరిలో గోపూజతో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ మల్లికార్జునప్రసాద్

వల్లూరు : పుష్పగిరిలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిల చేతుల మీదుగా ఆలయ ప్రాంగణంలో గోపూజను నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు మజ్జిగతో పాటు ప్రసాద వితరణ చేశారు. అనంతరం చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతనంగా గిరి ప్రదక్షిణ కమిటీ ఏర్పాటు చేశారు. ఇక ప్రతి పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ కార్యక్రమం గోపూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమం సంపూర్ణంగా దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సమక్షంలో గ్రామ సేవా సభ్యులు, సేవా కమిటీ సభ్యుల సహాయ సహకారంతో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేసిన బసిరెడ్డి, అర్చకులు సుమంత్ దీక్షిత్, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లలితా పరమేశ్వరీదేవి వార్షికోత్సవం



పూజలందుకుంటున్న లలితా పరమేశ్వరీదేవి

కమలాపురం : కమలాపురం-ఖాజీపేట ప్రధాన రహదారి పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద వెలసిన శ్రీ లలితా పరమేశ్వరీదేవి దశమ వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు లింగాల కేశవరావు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజల ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడులకను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, గణపతి హోమం, రుద్రస్వాహాకార హోమం, నవగ్రహ హోమం, మహా చండీ యాగం నిర్వహించారు. మహా పూర్ణాహుతి, మహా మంగళ నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం చేపట్టిన భజన పోటీలు ఆకట్టుకున్నాయి. కాగా సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరీ మాత

వల్లూరు : దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో పౌర్ణమిని పురష్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తితో బాటు ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

వీరపునాయునిపల్లె : సంగాలపల్లెలోని శ్రీశివకృష్ణ గోశాల, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కాశినాయ ఆలయానికి ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలమూర్తితో పాటు ఉత్సవ మూర్తికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కృష్ణాలయంలో బాగవత పఠనం, బగవద్గీత పారాయణం, భజన కార్రకమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గ్రామపంచాయతీలో అధ్వానంగా పారిశుద్ధ్యం



వేంపల్లెలో చెత్తడబ్బాలలో పేరుకపోయిన చెత్తా చెదారాలు

వేంపల్లె : వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. ఇటీవల గ్రామ పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి సస్పెండ్ కావడంతో ఇక్కడికి ఇన్‌చార్జి ఈవోను కూడా అధికారులు నియమించలేదు. దీంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. వాళ్లను అడిగే నాథుడే లేకుండా పోయారు. వారికి ఇష్టం వచ్చినట్లు ఎక్కడపడితే అక్కడ పారిశుద్ధ్యం చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. కొన్నిచోట్ల పది రోజులు కావస్తున్న పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారుల్లో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో చెత్తా చెదారాలు నిండిపోయి గాలికి వచ్చిపోయే వాహనాదారులు, పాదాచారుల పై పడుతున్నాయి. 17వ వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు చూడలేక కొన్నిచోట్ల చెత్త డబ్బాలలో నిప్పు అంటిస్తున్నారు. వార్డు మెంబర్లు ప్రజలు ఎవరికి చెప్పాలో తెలియక అవస్థలు పడుతున్నారు. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ఇంచార్జి ఈఓను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. వేంపల్లెలో కూటమి ప్రభుత్వం ఆధిపత్య పోరుతో అధికారులు ఎవరూ రావాలన్నా భయపడుతున్నారు. ఒక వర్గం నేను చెప్పిందే చేయాలని, మరో వర్గం నేను చెప్పినట్లే వినాలి అని అంటుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వంలోని రెండు వర్గాల నాయకుల్లో సఖ్యత కుదరకపోవడంతో అధికారులు వేంపల్లెకు రావాలంటే ఇష్టపడడం లేదు.

ముగిసిన భాగవత సప్తాహ కార్యక్రమం



భాగవత పండితులను సత్కరిస్తున్న బీఎస్ బ్రహ్మానందరెడ్డి దంపతులు

సింహాద్రిపురం : బిదినంచర్ల గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో దేవరకోన హరిహర క్షేత్రం భాగవత భక్త సమాజం నిర్వహణలో గ్రామస్తులు, దాతల సహాయంతో భాగవత సప్తాహ కార్యక్రమం ముగిసింది. శుక్రవారం ఆలయంలో గోపూజ, కలశాలను చేతపట్టుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భాగవత పండితులు, సేవకులు, తదితరులను వైఎస్సార్ సీపీ నాయకులు బీఎస్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ రఘునీరాణిలు ఘనంగా సత్కరించారు.